
# కవిత-కన్య



"నా పరువు కాపాడావు బాబూ!"

అంత పెద్ద మనిషి నోటినుండి ఇంత పెద్దమాట! ఓహ్! నేను ఆశించనూలేదు. ఆ మాటంటూ ఆ పెద్ద మనిషి ఒడిసి నా రెండు చేతుల్ని పట్టుకొంటాడని ఊహించనూలేదు.

నా ఆశ చేతులై గుండెను పరామర్శిస్తున్న అనుభూతి కన్నుల్లో ఒక కాంతి పుంజమై! – నిబ్బరించుకోలేక ఒడిసి పట్టుకొన్న చేతులవైపు జడుస్తూ జడుస్తూ ఆశగా చూశాను.

అవి వట్టి చేతులు!

ఆ కోలాహలంలో ఎక్కడినుండో మెరుపులాగ దూసుకొనివచ్చిన పెద్ద మనిషి ఎంత తొందరగా నా చేతుల్ని పట్టుకొన్నాడో అంతకంటే తొందరగా విడిపించుకొని 'ఇదో వస్తున్నా!' నంటూ ఎవరో పిలుస్తున్నట్టుగా వడివడిగా వెళ్ళిపోయాడు. ఆ పెద్ద మనిషి పట్టి విడిచినచేతుల్ని మరొకసారి చూసుకొన్నాను.

అవి వట్టి చేతులు!

నా చేతులు వట్టివే అని నాకెప్పుడూ తెలుసు. అయితే ఆ పెద్దమనిషి అలాకాదు. ఆ పెద్ద మనిషికి తగినంత పెద్ద అధికారముంది. అధికారానికి తగిన అంగబలం. అంగబలానికి తోడు ఆర్థిక వసతి! అంత పెద్దమనిషి ఏ చేతినైనా పట్టవచ్చు లేదా పట్టిన చేతిని విడిచి పెట్టవచ్చు. ఎలా జరిగినా ఆ పెద్దమనిషి చేతులు వట్టిచేతులుగా మిగలవు. అతడు ముట్టితే మట్టి బంగారమవుతుంది. అందుకే ఆయనవి బంగారు చేతులు!

సాదా సీదా చేతుల్ని బంగారు చేతులే తాకాయి. అయినా వాటి వాత మట్టిపడింది. కనీసం ఆమట్టిమరకలయినా మిగిలాయేమో? అని మళ్ళీ ఒకసారి రెండు అరిచేతుల్ని జాగా విప్పిచూసుకొన్నాను. అక్కడక్కడ కొన్ని మరకలు. పరిశీలనగా చూశాను. అవి పసుపు మరకలు. హైందవ సంప్రదాయంలో ఆ పెద్దమనిషి తలమునకలవుతూంటే నిదర్శనంగా నిలిచిన చిహ్నాలు! వాటిని నిశితంగా చూస్తూ నిలబడ్డాను. ఆ పసుపు మరకలు పరిహసిస్తున్నాయి. దృష్టి మారింది. చుట్టూ కలయచూశాను.

పచ్చని తోరణాలు... కను పండువు గూర్చెడి వింతవేడుకలు... విచ్చిన పూవుగుత్తులు... వీనుల విందగు మేళతాళములు... వచ్చిన బంధువర్గముల వారిజనేత్రల హాసలాసాలు- పసందుగా ఉన్నాయి.

ఆకాశమంత పందిరికింద భూదేవంత అరుగుమీద ఆ పెద్దమనిషి కూతురిపెండ్లి పెద్దఎత్తున జరుగుతూ ఉంది. విలువైన మనుషులు కుర్చీల నిండుగ కొలువుదీరి ఉన్నారు. వాళ్ళల్లో హుందాతనం ఉట్టిపడుతూ ఉంది. మరికొన్ని ఖద్దరు వస్త్రాలు కలగాపులగంగా కలిసి గలగల నవ్వుకొంటున్నాయి. కొందరు సుందరాంగులు ఖరీదైన పట్టుచీరెల కుచ్చెళ్ళు సవరించుకొంటూనో పైట సర్దుకొంటూనో అందానికి మెరుగులు దిద్దుకొంటున్నారు. వాళ్ళ మొగాలలో చిరుచెమట బిందువులు. వాటి అదృష్టం!- అవి కూడా ముత్యాల్లా మెరుస్తున్నాయి. అరుగు భూదేవంతయినా ఆలోచనా పరుడైన మనిషి రక్షణకోసంగా హద్దులు నిర్మించుకొన్నాడా అరుగుకు- ఇనుపకమ్ముల్ని అటూయిటుగా వంచి అందులో కూడా అందాలు చొప్పించి! ఆ కమ్ముల్ని పట్టుకొని వేలాడుతున్నాయి గబ్బిలాల్లాంటి కొన్ని మానవాకారాలు. ఆ ఆకారాలకు అక్కడి వేడుకలకు పొంతనాలు కుదరవు. అయినా వాళ్ళ మొగాల్లో ఆనందం!- ఈర్ష్యను ఈసడించి కొడుతున్న ఆనందం!- ఎప్పుడో ఒకప్పుడు బయట పడక పోతాయా ఎంగిలాకులు అన్న తృప్తితోకూడిన ఆనందం!- వాళ్ళను గురించి ఆలోచిస్తే నీకంటే వాళ్ళే నయం! అని మనసు మొట్టింది. దృష్టి మారింది. మారిన దృష్టి వివాహ వేదికవైపు మళ్ళింది. అక్కడ బహుమతులందచేయడానికి జనం తొక్కిసలాడుతున్నారు. అందుకోలేక పురోహితుడు అవస్థపడుతున్నాడు. ఒక చేత్తో అందుకొంటూ మరొక చేత్తో నొసటపట్టిన చెమటను తుడుచుకొంటున్నాడు. బహుమానం చేతికందడమే తరువాయి. ఏదో వినపడీ వినపడకుండా గుక్క తిప్పుకోలేకుండా గొణుగుతున్నాడు. మాటిమాటికి 'పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి'- అన్న మాటల్ని మాత్రం గట్టిగా పలుకుతున్నాడు. పెండ్లి కుమార్తె వెక్కిరించింది కండ్లతోనే!- పెండ్లికొడుకు సద్దూసడీ లేకుండా మోచేత్తో పెండ్లికూతురి కటిస్థలిపై కుమ్మాడు. పెండ్లికూతురు పందిరి పట్టనంత సిగ్గును కుమ్మరిస్తూ పెండ్లికొడుకు వైపు కొర కొర చూసింది.

"ఇదేవిఁ సోద్దెవఁమ్మా! పీటలమిందనే పండ్లిగిలిస్తావుండారీ కాలం పిల్లకాయిలు. మా కాలాల్లోనా? తలకాయ పైకెత్తాలంటే కొండలు నెత్తిమిందే!" వధూవరుల వగల సెగలకు తట్టుకోలేక దవడలు నొక్కుకొనిందొక వయసుమళ్ళిన ముత్తైదువ.

'పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి' మళ్ళీ ఒకసారి గొంతు చించుకున్నాడు పురోహితుడు. ఆ మాటలు మళ్ళీ చెవుల్లో ములుకుల్లా గుచ్చుకున్నాయి!

ఆశీర్వాదం!– గుండె బాధగా మూలిగింది. ఆలోచనలతో మనసు నలుగుతూ ఉంది!

సరిగ్గా ఆనాటికి ఆరు రోజుల కిందటిమాట!

ఆ పెద్దమనిషి స్వయంగా నా ఇంటికి వచ్చాడు. నా ఇంటిముందు కారు నిలిచింది. కార్లోనుండి ఆయన దిగాడు. దిగి కాళ్ళతోనే నడిచి వచ్చాడు నాఇంట్లోకి. నాకన్నుల్ని నిజంగా నేను నమ్మలేదు.

"ఎందుకలా తెల్లమొగమేస్తావ్? ...నేనే!" అన్నట్లుగా గలగల నవ్వుతూ ఆ పెద్దమనిషి భుజంమీద చేయివేస్తే ఎగిరిపడ్డాను. కాలు గాలిన పిల్లిలా అటుయిటు తిరిగాను. చేతికి దొరికిన దాన్నంతా విసిరిసిరి కొట్టాను. 'ఛీ!ఏంపాడు బతుకులో? కొంప కెవరైనావస్తే కూర్చోమనడానికి కూడా గతి లేదే!' అని మనసు గొణుగుతూవుంది. చివరికి ఎవరో పుణ్యాత్ముడు ఎప్పుడో దయతలచి ఇచ్చిన ఇనుప కుర్చీ మూలపడివుంటే శ్రీమతి అందించింది. బ్రతుకు జీవుడా! అనుకొన్నాను.

అయినా దాని తీరు చూస్తుంటే నాకే అసహ్యమనిపిస్తూ ఉంది. నాలాంటి వాడికొంపల్లో బయటికి పొక్కలేని పొగల సెగలు కొంపలోనే చోటుచేసుకొంటే– దాని ప్రభావంతో కుర్చీ బాగా పొగచూరింది. పైగా బెత్తెడు మందం దుమ్ము నిండి ఉంది. 'ఎలా కూర్చుంటారో?' అని సంకోచిస్తూనే పాతగుడ్డకోసం దిక్కులు చూస్తుంటే ఇవేమీ పట్టించుకోనట్లు పెద్దమనిషి దర్జాగా కూర్చున్నారు. సాదరంగా నావైపు చూశారు. సిగ్గుతో చచ్చినంత పని అయింది. తలవాలింది. వాలిన తలపైన ఆలోచనలు వాలాయి. అంత పెద్దమనిషి ఇంతచిన్నవాడి ఇంటికి ఎందుకు వచ్చారా? అని ఆలోచిస్తున్నాను.

నన్నా యిబ్బందిలో పెట్టలేదా పెద్దమనిషి!

"చూడండి! మా అమ్మాయికి పెండ్లి నిశ్చయమయింది. సరిగ్గా యిక ఆరు రోజులేఉంది!"

ఈ మాటలంటుంటే అతని పెదవులపై చిందులేస్తున్న చిరుదరహాసం. కన్నుల్లో తొణికిసలాడుతున్న ఆనందం!– అవును మరి. ఆడపిల్ల పెండ్లికదా? ఈ రోజుల్లో అమ్మాయికి మొగుడు దొరకడమంటే మాటలా? అయినా ఇలాంటి పెద్దమనుషులకేం? వేలం పాటలో ఎంతకయినా తెగబడగల సమర్థులు. కొంటారు. ఇందులో నా ప్రమేయమేమిటో?– ప్రశ్నార్థకంగా అతని వైపు చూశాను. అతడు గ్రహించినట్లుగా–

"మీరు నాబిడ్డను ఆశీర్వదించాలి" అన్నాడు.

ఎక్కడో గోడ మీది బల్లి కిచకిచమని అరిచింది. నాకు తెలియకనే నా శరీరం మెలికలు తిరుగుతూ ఉంది. రెండు అరచేతులు ఒకచోట చేరాయి. కొండెక్కినంత సంబరంతో కూడపలుక్కొంటున్నాయి. ఈ మాట చెవినిపడేసరికి శ్రీమతి పరవశించిందో? లేక మూర్ఛపోయిందో? లోపల సత్తుగిన్నెలు కలబడిన రంపు. దరిద్రుడి ఆశీర్వాదానికి అంత బలమున్నట్లుంది!

నా ఆలోచనతో కానీ సందేహాలతో కానీ ఆ పెద్దమనిషికి అవసరమున్నట్లు తోచలేదు. నా మౌనాన్ని అంగీకారంగా స్వీకరించినట్లుంది.

"మీరిక్కడ కూర్చుంటే తెమలదు. పదిమంది పెద్దల్లో పని. రచన అద్భుతంగా ఉండాలి. సరిగ్గా రేపీపాటికి వస్తాను. మీరు తయారుగా ఉండాలి మరి!"

"తయారుగా ఉండమంటే?"- అని అడుగుదామనుకొన్నాను. అంత పెద్దమనిషిని అలా అడగడం భావ్యం కాదని తల ఆడించాను గంగిరెద్దులా!

ఆయన పైకి లేచి రెండు చేతుల్ని జోడించారు. అంత పెద్దమనిషి నమస్కరిస్తుంటే ప్రతినమస్కారం చేయాలన్న ఇంగిత జ్ఞానాన్ని కూడా కోల్పోయాను- చూపులాతని వీపువైపు లాగుతూంటే! వీపునిండ అద్దకం అద్దినట్లుగా పొగచూరు మరకలు! 'దరిద్రుడి కొంపలో అడుగుపెడ్తే ఇదే ఫలితం! అన్నట్లు నన్ను పొడుస్తున్న చురకలు!!...

ఆయన వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిపోయినా ఆయన్నొదిలి నా ఆలోచనలు పోలేదు. ఆ రాత్రి పడుకొన్నాను!

రాత్రి పడుకొనక మరేంచేస్తారు? అయినా ఈ బ్రతుకులో పడుకొన్న రాత్రులకంటే కూర్చుని ఆలోచించిన రాత్రులే ఎక్కువ. ఎక్కడ ఎలా పుట్టేవో ఆలోచనలు! ఆది అంతు లేకుండా పెరిగేవి. ఎక్కడెక్కడో చుట్టి తిరిగేవి. ఎప్పుడెలా అంతరించేవో తెలిసేదికాదు. తెలివి వచ్చేసరికి తెల్లారిపోయేది. ఇలా నా బ్రతుకులో ఎన్నోసార్లు తెల్లారింది!

"ఆరాత్రి మాత్రం పడుకొన్నాను. ఆ రోజు అందిన అవకాశంతో మరికొన్ని రాత్రులైనా పడుకోవచ్చు గదా? అన్న ఆశతో పడుకొన్నాను.

పున్నమి నాటికి ముందటిరోజు. ఆనందానికి ఆకారం వచ్చినట్లు పండు వెన్నెల. నాయింట్లో మాత్రం పొడలు పొడలుగా పడుతూ ఉంది. కుక్కి మంచంమీద పడిఉన్నాను. 'ఆశీర్వాదం అద్భుతంగా ఉండాలి!' అన్న ఆ పెద్దమనిషి మాటలు చెవుల్లో గంటలు కొడుతున్నాయి.

"నాన్నా! మా క్లాసులో అందరు చెప్పులు తొడుక్కొని వచ్చేవాళ్ళే- నేనొకదాన్ని తప్పితే. ప్రాణం చస్తూ ఉంటుంది నాన్నా!" పదవతరగతి చదువుకొంటున్న పెద్దమ్మాయి చెప్పలేక చెప్పింది. కుక్కి మంచం ప్రక్కన నిలబడిన పెద్దమ్మాయిని చూశాను. ఆమెతో కలిసి చదువుకొంటున్న అమ్మాయిల్ని ఆమె ప్రక్కన ఊహించాను. చెప్పులు!... నిజంగా ఉంటే వాటితోనే పటపటకొట్టుకొందామనిపించింది. బాధగా మూలిగాను. పెద్దమ్మాయి వెళ్ళిపోయింది.

రెండు మూడు నాలుగు వరుసగా వచ్చారు. రెండోదానికి లోబాడీలు పూర్తిగా చినిగిపోయాయట. కుట్టి కుట్టి ఇక కుట్టే దానికి కూడా వీలు పడడం లేదట. చెప్పలేక చెప్పింది. మూడోవాడికి పలక పగిలిపోయిందట. వాళ్ళయ్యగారు పలకపట్టుకొని రాకుంటే బెంచిమీద నిలబెడతానన్నాడట. నాలుగోవాడు చంటివెధవ. వాడిది చాక్లెట్ బుద్ధి. అన్నీ విన్నాను. ఆనాడు వెదుక్కొంటూ వచ్చి తలుపు తట్టిన అవకాశంతో సమన్వయిస్తున్నాను.

"ఏవండీ! రేపు మధ్యాహ్నానికి బియ్యం లేవు," ఉన్నమతిని కాస్త పోగొట్టడానికి శ్రీమతి రంగప్రవేశం చేసింది.

'సరే!' అన్నాను. కాస్త కటువుగా వినిపించిందేమో? పసిగట్టిందా ఇల్లాలు. పైట చెరగు పరుచుకొని ఆ కటికనేల మీదనే కుక్కిమంచం ప్రక్కనే మేను వాల్చింది.

ఊరు నిద్ర పోయింది. ఊరితో కలిసి నాయిల్లు. ఆ పెద్దమనిషి... అతనితో కలిసి భార్యా పిల్లలు అందరు హాయిగా నిద్రపోతూ ఉంటారు. నేను మాత్రం మేల్కొనే ఉన్నాను. ఆశీర్వదించాలిగా మరి!- ఆ మరసటి దినం నేనా పెద్దమనిషి కోసం ఎదురుచూడవలసిన అవసరం లేకపోయింది. చెప్పిన వేళకు సరిగ్గా వచ్చారు. పెద్దమనుషుల లక్షణం అది. కారు వీధిలో నిలిపి ఆయన ఇంట్లోకి నడిచే వచ్చారు. అప్పటికే శ్రీమతి నన్ను తయారుచేసింది. ఒక పైజామా లాల్చీ ఎప్పుడూ ఆమె స్వాధీనంలోనే ఉంటాయి. ఈలాంటి సదవకాశాల్లోనే వాటికి కాస్త గాలి వెలుతురు తగిలే అదృష్టానికి నోచుకొంటాయి. నన్ను చూస్తూనే ఆయన కన్నులు పెద్దవయ్యాయి. బహుశా నిన్నిటికంటే నేటి వేషం ఆయనకు నచ్చినట్లుంది.

'ఇక వెళ్ళదామా?' అన్నట్లుగ ఆయన కన్నులతోనే పలకరించారు. ఆయన ముందు నేను వెనుకగా బయటికి నడిచాము. కారు ఆధారంగా వాలబడిన డ్రైవరు నిటారుగ నిలబడి తలుపు తెరిచి పట్టుకొన్నాడు. నన్ను ముందు కార్లో కూర్చోమని ఆ తరువాతనే ఆయన కూర్చున్నారు. కారు బయలు దేరబోతూంటే తిరిగి చూశాను. తలుపు సందుల్లో రెండు కండ్లు. ఇంతింతలై తృప్తిగా చూస్తున్నాయి. ఆ తృప్తి తలుపు సందుల్లో దూరి నాగుండెల్ని పరామర్శించింది. పక్కన ఊహించుకొంటూ ఉంటే గుండె బాధగా మూలిగింది. ఒదిగి కూర్చున్నాను. గాలిలో తేలిన కారు ఓ పెద్ద హోటలు ముందాగింది. ఆయన దిగారు. ఆయన వెంట నేనూ దిగాను. ఆయన ముందునడుస్తున్నారు. నేనాతన్ని అనుసరిస్తున్నాను. మమ్మల్ని చూసిన ఓ కుర్రవాడు మాకంటే ముందుగా పరుగుతో మిద్దె మెట్లెక్కుతున్నాడు. అయిదంతస్థులున్న ఆభవంతిలో మూడవ అంతస్థులో ఓ గదిముందు మాకంటే ముందుగా పరుగెత్తిన ఆ కుర్రవాడు కనుపించాడు. మాకోసమే ఎదురు చూస్తున్నట్లు మేమాగదిని సమీపించే సరికి అతి వినయంగా ఆ గది తలుపు తెరిచాడు.

అది ఒక అందమైన గది. నాలాంటి వాడి ఊహలకే పరిమితమైనగది. ఆ గదిలో ఓ కుర్చీపై కూర్చుంటూ ఆ పెద్దమనిషి 'ఎలా ఉందంటారు?' అని ప్రశ్నించాడు. అలా అడుగుతూంటే 'నీ కొంపతో పోల్చుకొని చెప్పు!' అని అడుగుతున్నట్టుంది. గంజితాగేవాని చేతికి పాయసమిచ్చి

ఎలావుందంటే ఏమంటాడు? కటిక నేలమీద పడుకునే వానికి మెత్తని పరుపు చూపించి ఎలావుందంటే ఏమంటాడు? అద్భుతమంటాడు. అని తీరాలి. ఆమాటే నేనూ అన్నాను.

"ఇంతకంటే అద్భుతంగా ఉండాలి ఆశీర్వచనాలు!"– అన్నాడు గల గల నవ్వుతూ. ఆయన అలా నవ్వుతూంటే అక్కడక్కడ మీసాల్లో నెరసిన వెంట్రుకలు మిల మిలా మెరుస్తున్నాయి.

"రే బాయ్!" ఆయనొక్క పొలికేక వేశాడు. తలుపు తెరిచిన కుర్రవాడు అంతవరకు బయట నిలబడిఉన్నాడేమో? పిలుపుతో వచ్చి ఎదుట నిలబడ్డాడు.

"చూడబ్బాయ్! అయ్యగారిక్కడ ఉంటారు. వారికేం కావాలో ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకొంటూ అప్పటికప్పుడే అందచేస్తుండాలి తెలిసిందా?" ఆ పెద్దమనిషి గంభీరంగా ఉత్తర్వు జారీ చేశాడు. తెలిసిందన్నట్టుగా కుర్రవాడు తల ఆడించాడు.

"కవిగారూ! మీ ఇష్టమొచ్చినంత సేపు మీరిక్కడ ఉండవచ్చు. మీరిక్కడ ఉన్నంతసేపు మీక్కావలసిన సదుపాయాలు అందుతుంటాయి. హ్హాహ్హాహ్హా! మళ్ళీ మళ్ళీ చెప్పవలసిన అవసరం లేదనుకొంటాను. ఆశీర్వాదం హ్హాహ్హాహ్హా.... అద్భుతంగా ఉండాలి! మరి నేవెళ్లొస్తాను!" అంటూ ఆ పెద్దమనిషి బయలు దేరాడు. కుర్రవాడు జాగ్రత్తగా తలుపు మూసుకొంటూ ఆ పెద్దమనిషి వెంట బయటికి నడిచాడు.

కుర్రవాడు మూసిన తలుపుకు ఎదురుగా ఓ తలుపు. ఆ తలుపు తెరిచి చూశాను. అంత ఎత్తునుండి చూస్తుంటే ఊరంతా కనుపిస్తూ ఉంది. ఆ ఆవరణలో పెరిగిన కొబ్బరిచెట్లు అందుకోవచ్చునన్నంత చేరువలో హాయిగా ఊగుతున్నాయి. ఆ కొబ్బరి చెట్లపై రామచిలుకలు రాగాలు తీస్తున్నాయి. ఈ రెండు తలుపులు గాక ఆ గదికి మరో తలుపు ఉంది. తెరిచి చూశాను. అది స్నానాల గది. నిజంగా ఈలాంటిచోట కూర్చుంటే తిండీతిప్పలు కూడ మరిచి రాసుకోవచ్చునేమో? అనిపించింది. నిలువుటెత్తు అద్దం నిగనిగలాడుతుంటే ముందు నిలబడ్డాను. అంతమంచి మొగానికి అర్ధసేరు పసుపా?– అన్నట్లు నీబతుక్కు కూడా కోరికలా? అని నాముఖమే నన్ను వెక్కిరిస్తూ ఉంది. అద్దంముందు నిలబడలేక మంచంమీద కూర్చున్నాను. కూర్చుంటే పడుకోవాలనిపించింది. పడుకొంటే ఈసౌఖ్యం ఇలా శాశ్వతమైపోతే? అన్న ఆశ కలిగింది. కొబ్బరిచెట్టుపై ఓ పిట్ట 'కికికీ!' అని అరిచింది.

లేచాను. మేజావైపు నడిచాను. మేజామీద కలం కాగితాలు. కలం కంటే కాగితాలు, కాగితాలకంటే కలం అందంగా కనిపిస్తున్నాయి. 'ఆశీర్వాదం అద్భుతంగా ఉండాలి!' అన్న ఆ పెద్దమనిషి మాటలు అంతకంటే కమ్మగా వినిపిస్తున్నాయి. అంతలో తలుపు తెరచిన చప్పుడు. నా చూపును మరల్చింది. కాఫీతో ప్రత్యక్షమయ్యాడు కుర్రవాడు. కాఫీ అందుకొన్నాను. 'మధ్యాహ్నానికి బియ్యం లేవండీ!' అన్న శ్రీమతి మాటలు మతికొచ్చాయి. చేతికందింది నోటికందలేదు. ఆలోచిస్తూ కూర్చున్నాను.

"ఏదైనా కావాలంటే పిలవండి సార్!" అన్నాడా కుర్రవాడు.

"ఎక్కడుంటావ్"?

ఓ క్షణం వింతగా చూశాడు కుర్రవాడు నన్ను. ముసిముసిగా నవ్వుతూ ఓ మీటను చూపాడు. 'దీన్ని నొక్కండి!' అన్నాడు. ఆ మీటవైపు చూశాను. దానిపై గంట గుర్తుంది.

"ఓహో! ఇది బెల్ అన్న మాట!" అన్నాను ఆ కుర్రవాడితో!

ఔనన్నట్లు తలూపాడు. తల వంచుకొని నవ్వుతూ వెళ్లిపోయాడు.

"ఆమాత్రం తెలియని దేబెమొహమా నువ్వు?" అన్నట్లుంది వాడి నవ్వు.

కుర్చీలో కూర్చున్నాను. కాగితాలు ముందుంచుకొన్నాను. కలం చేతికి తీసుకొన్నాను. అలా ఎంతసేపు గడచిందో తెలియలేదు. అంత లోపుగా తలుపు తెరిచిన చప్పుడు కావడంతో ఈ లోకంలో పడ్డాను. తలుపు వైపు తిరిగి చూశాను. ఆశ్చర్యం! నేను చూస్తూఉండగానే ఓ సుందరాంగి వయ్యారాలు పోతూ గదిలోపలికి వచ్చేసింది. తడబడుతూ పైకి లేచాను. గుండెలు గడగడ కొట్టుకొంటున్నాయి. ప్రయత్నించినా మాట పెగల్లేదు. "ఎందుకంత గాబరా పడిపోతున్నారు?... నేనూ మనిషినే!" గలగల నవ్విందాసుందరి గదినిండా మల్లెలు వెదచల్లినట్లు.

"మీరు....మీరు....దారితప్పారేమో?"

ఆ మాటతో ఆమె విరగబడి నవ్వింది. నవ్వుతూ వయ్యారంగా వెనక్కు తిరిగింది. మూడుగులు ముందుకు వేసింది. గది తలుపులు మూసి గొళ్లెంపెట్టింది. ఆ తరువాత ఆనందమే కదలివచ్చినట్లుగా నవ్వుతూ నా వద్దకు వచ్చింది. నా రెండు భుజాలమీద రెండు చేతులు వేసి విల్లులా వెనక్కు వంగింది. నేనేమైపోతున్నానో నాకే తెలియలేదు.

"ఏమన్నారు? దారి తప్పానన్నారా? హ్హా హ్హా హ్హా!... నేనెప్పుడో దారి తప్పాను!" చిలిపిగా చూస్తూ చిలకలా పలికింది."

మంచి సెంటు వాసన. ఊపిరాడడం లేదు!

"అదిగాదండీ!..... మరేమో నండీ మరేమోనండీ... ఏకాంతం... కోసం... ఓ పెద్ద మనిషి...." ఊపిరి కూడకట్టుకొని ఎలాగో కొతికి కొతికి మాటల్ని అతికించగలిగాను.

కిలకిలా నవ్విందా జవ్వని! వజ్రాలకుండ నుండి ముత్యాలు చిందబోసినట్లు. అవి గది నిండా పొరాడుతూ నన్ను పరామర్శిస్తున్నాయి.

"అయితే ఈ గది ఎవరిదని కూడా తెలుసుకోకుండా వచ్చావన్నమాట! మీ మాటల్ని నమ్మమంటారా?"–

భుజాన చేతులుభుజం మీదే వున్నాయి. ఆమె బుజ్జగించినట్లు మాట్లాడుతూ ఉంది. నాకు నిబ్బరం దొరుకుతున్నట్లనిపించింది.

"మీరు నమ్మినా నమ్మకున్నా నాకేమీ నష్టంలేదు. ఓ పెద్దమనిషి ప్రత్యేకించి ఏకాంతంకోసం ఈ గదిని ఏర్పాటు చేశారు."

"ఆ పెద్దమనిషే ఏకాంతంలో ఈ కాంతను కూడా ఏర్పాటు చేశారంటే!"

"ఎందుకూ?"

"మీ కానందాన్నివ్వడానికి!" కాటుక కన్నుల్ని గీటుతూ పలికిందా సుందరి!

"హుం! ఆనందం,... ఎక్కడుంది ఆనందం?" నోరు గొణుగుతూ ఉంది. చేతులు భుజంమీది చేతుల్ని మెల్లగా తొలిగించాయి.

తొలిగించిన రెండు చేతుల్ని ఆమె తేలికగా పైకి లేపింది. వయ్యారంగా నీలుగుతూ పెనవేసింది. ఆమె నీలుగుతూ ఉంటే వక్షస్థలం నలుగుతూ ఉంది. బిగుతుగా వున్న రైక బరువుగా నిట్టూరుస్తూ ఉంది. పైట చెరగుకు సంపూర్ణ స్వేచ్ఛ లభించింది. తనంతట తానుగా తొలిగి రెపరెపలాడుతూ ఉంది. పంకా గాలితో నా గుండె పోటీపడి నాలో కూడా నరాలున్నాయనిపిస్తూ ఉంది.

అంత లోపల తలుపు తట్టిన చప్పుడు!

ఆమె ఓరగా నావైపు చూస్తూ పైట సర్దుకోవడానికి కూడా ఓపిక లేనట్లుగా నటిస్తూ వయ్యారంగా తలుపు దగ్గరికి నడిచింది. అప్పుడు మేజామీది కాగితాల వైపు చూశాను. ఒక్కపద్యం పూర్తయి రెండవ పద్యంలో రెండవ పాదం వరకు నడిచింది నా ఆశీర్వాదం. రాసిన దానికంటే రాయవలసిందే ఎక్కువగా ఉంది. ఇంత లోపుగా ఈ ఇరకాటంలో పడ్డాను. తలెత్తి చూసేసరికి కుర్రవాడు మేజామీద సోడాబుడ్డీలను సర్దుతున్నాడు. దాదాపు పది పన్నెండు సోడా బుడ్డీలు వాటి పక్కన మరో సీసా. ఆ పక్కగా ఓ కాగితం బుట్ట అందంగా అమర్చాడు. వంచిన తల ఎత్తకుండా వచ్చినదారి పట్టాడు. ఆ సుందరి వాడి వెంటనే వెళ్ళింది. తలుపు మూసి గొళ్ళెం పెట్టింది. క్షణక్షణానికి బెంబేలు పడిపోతున్న నా వైపు ఇంతింత కళ్ళతో వింతగా చూసింది తలుపు కానుకొని!

ఏమనుకొనిందో ఏమో? మెల్లగా ముందుకు నడిచింది. రెండు గ్లాసులు తీసుకొనింది. జాగ్రత్తగా కడిగింది. రెండు గ్లాసుల్లో ఆ సీసాలోని ద్రవాన్ని అంతంత పోసింది. సోడాతో ఆ గ్లాసుల్ని భర్తీ చేసింది. ఆ కాగితాల బుట్ట నుండి మంచు ముక్కల్ని తీసి రెండు గ్లాసుల్లో రెండు వేసింది. ఒకటి తాను తీసుకొంది. మరొక్కటి నా కందివ్వపోయింది.

"క్షమించండి, నాకలవాటు లేదు!"

ఒక్కచూపు విసిరింది నావైపు, 'ఒరే! పూర్‌ఫెలో! నువ్వేం మనిషివి రా?' అని ప్రశ్నించినట్లుందా చూపు. చేసేది లేక తలవాల్చాను దోషిలా!

అడుగు తీసి అడుగువేస్తూ హంసలా నడుస్తూ అడుగడుగునా అందాలు చూడమని సవాలు చేస్తూ నా దగ్గరికి వచ్చింది. ఎడమచేతి నడిమి వ్రేలిని గడ్డానికి మోపి మెల్లగా పైకి లేపింది. కుడిచేతిలో గ్లాసు గ్లాసులో మంచుముక్క, చిత్రంగా బుడగలు వదులుతూ కరుగుతూ ఉంది. చిత్రమైన అనుభూతితో నాలో మైకం పెరుగుతూ ఉంది.

"ఆరంభిస్తే ఏదైనా అలవాటు పడుతుంది!... ప్లీజ్!.... అలవాటు లేదని చేతికందిన సౌఖ్యాల్ని దూరం చేసుకోవడం వెర్రితనం!"- బతిమాలిందామె. ఆరితేరిన ఆ మనిషితో వాదం అనర్థదాయకం. అందుకే రెండుచేతులూ జోడించాను. తోడుగా ఏడుపు మొగం పెట్టాను.

ఇక లాభం లేదనుకొన్నట్లుందామె. అదోరకంగా చూసింది నన్ను. ఆమె అలా చూస్తుంటే ఆమె రెండు భుజాలు ఒక్కసారి అలా ఎగిరి పడ్డాయి. కింది పెదవి వక్రసుడిలా తిరిగిందొక్క క్షణం!- పగలే మెరుపు మెరిసినట్లు.

ఆ తరువాత ఆమె వెళ్ళి అద్దం ముందు కూర్చొనింది. ఒకసారి అద్దంలో తన్నుతాను చూసుకొనింది. అద్దం ముందు నిలబడితే అనాకారి కూడ అందగాడే. అసలే ఆమె అందకత్తె. ఆమె కన్నుల్లో తృప్తిని గమనిస్తుంటే- 'అప్పుడే ఏమయింది నీ కత? అని సవాల్ చేస్తున్నట్లుంది. కన్నార్పకుండా ఆమె వైపే చూస్తూ నిలబడ్డాను. ఆమె గ్లాసు చేతికందుకొనింది. ఉండుండీ ఆమె గ్లాసును ముద్దుపెట్టుకొంటుంటే చూడముచ్చటగా ఉంది. ఆ గ్లాసు స్థానంలో నేనుంటే?.... ఓ క్షణం పాటు మనసులో వికారం. నన్ను నేను నిలదొక్కుకోలేని వికారం. అయితే ఇప్పుడామె పూర్తిగా నన్ను విస్మరించింది.

ఆ గదిలో ఆమె పనిలో ఆమె!- నాపనిలో నేను!!- అయితే అప్పుడప్పుడు మాత్రం చూసీ చూడనట్లు ఆమె నన్ను చూస్తుంటే తోచీతోచనప్పుడంతా నేనామెను చూస్తున్నాను. చిత్రమైన వాతావరణం. అలాంటిదే అనుభూతి. ఈ కొత్త అనుభూతితో ఊహలు ఊరేగుతున్నాయి. నాలో ఏదో ఒకరకమైన పరవశం! మెదడు కాస్త చురుగ్గా పనిచేసిందనే చెప్పాలి. నా రచన పూర్తయింది.

ఒక్కసారి ఆదినుండి తుదివరకు చదువుకొన్నాను. మరోసారి మరోసారి చదువుకొన్నాను. నా రచన నాకే తృప్తినిచ్చింది. ఇక నాకాగదితో పనిలేదు. బయలుదేరుతూ ఆమె వైపు చూశాను. ఆమె ఈ లోకంలో ఉన్నట్లుగా తోచలేదు. పరిచయం స్వల్పమైనా చెప్పకుండా వెళ్ళడం భావ్యం కాదనిపించింది. అందుకే-

"ఇకనే వెళ్ళొస్తానండీ!"- అంటూ చేతులు జోడించాను.

"అప్పుడే వెళ్ళిపోతారా?"

"అవును!"

"ఏం?"

"వచ్చిన పని అయిపోయింది కాబట్టి!"

"వచ్చిన పని అయిపోయిందా?"

అంత మత్తులో కూడా సందేహంగా అడిగిందామె.

"అయిపోయింది"

గలగల నవ్విందామె గచ్చకాయ కుండలో చెయ్యిబెట్టి కలబెట్టినట్లు!

"మరి ఈ మాత్రానికా ఆ పెద్దమనిషి కింత నష్టం?"

"నష్టమా?" ఆశ్చర్యంగా అడిగాను.

"కాదా మరి?"–

బుస్సుమని త్రాచులా లేచింది. లేచిన మనిషి ఒక్క ఊపులో ఆ గదిలో ఓ గోడ దగ్గరికి చేరింది సర్రుమని ఒకర్టెన్ గుడ్డను లాగింది. తెల్లటి ఆ గోడమీద ముగ్గేయడానికి పెట్టినట్లుగా లెక్కలేనన్ని చుక్కలు! ఆ చుక్కల్ని నేను ఆశ్చర్యంగా చూస్తుంటే ఆమె ఒకసారి నన్ను మరోసారి చుక్కల్ని చూస్తూ విరగబడి నవ్వింది.

"ఎందుకలా నవ్వుతున్నారు?"

"నవ్వకుండా ఏడవమంటారా?

"ఇదో వీళ్ళందరూ నీ సోదరులు. వీళ్ళలో కొందరి కోసం నేను వచ్చాను. కొందరు నాకోసం వచ్చారు. వీళ్ళల్లో నువ్వొక్కడివి కాకుండా వెళ్ళిపోతున్నావే? అని నవ్వుకొంటున్నాను"– ఆచుక్కల్ని చూపుతూ పలికిందా చక్కనిచుక్క.

ఆ మాటలు వింటూ అలాగే నిలబడిపోయాను. ఆముదం తాగినట్లున్న నామొగం ఆ సుందరిని ఆకర్షించినట్లుంది. నా దగ్గరగా వచ్చి– 'ఈ మట్టి బుర్రకు అర్థంకావడం అంతా కష్టమే!' అని తలమీద మొట్టింది తూలుతూ. ఆ తరువాత కాస్త నిలదొక్కుకొని 'వచ్చిన పని అయిందన్నావుగా? ఏమిటా పని?' అని అడిగింది.

"నేనేదో నాలుగు పద్యాలు రాసుకోవడానికి వచ్చాను!"

"నువ్వు కవిత్వం రాస్తావా?"– వెర్రిగా నవ్వుతూ ఉందా వింత మనిషి. ఆమె నవ్వును అర్థం చేసుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాను. నాది మట్టి బుర్రగా జమకట్టిన ఆ సుందరి నా ప్రయత్నానికి చోటివ్వలేదు.

"హ్హా హ్హా హ్హా! నువ్వు కవిత్వాన్ని నమ్ముకొన్నావ్? 'పిచ్చి' దాన్ని నమ్ముకొని బాగుపడిందెవడు? ఆనాడు వాడాపోతన నమ్ముకొన్నాడు. వాడిచేత మడకపిడి పట్టించింది. శ్రీనాధుడూ నమ్ముకొన్నాడు, వాడిని అంబారీల్లో తిప్పినట్లు తిప్పి కడకు గుదిబండలు మొయ్యించింది!"

ఆశ్చర్యం నుండి తేరుకోలేక తికమకలు పడుతున్నాను. ఆమెలో అంతకు ముందుండిన చిలిపితనం ఎలా మాయమైందో మాయమైంది. మనిషి గంభీరంగా మారిపోయింది. కుర్చీలో హుందాగా కూర్చొనింది. ఇప్పుడు నేను ఆశ్చర్యంలో పడడం కాదు పడి కొట్టుకుపోతున్నాను.

"ఏదీ! ఓ పద్యం చదవండి చూద్దాం?"– మాట తీరే మారిపోయింది. అడగడంలో పద్యాన్ని విందామన్న కుతూహలం కంటే "ఏదీ! చదువు చూద్దాం నీకవిత్వంలో పస!" అన్న సవాల్ ఉట్టిపడుతూఉంది.

జలజల పూలురాల మనసారగ పెద్దలు మేలుగోరక
న్నొలకుల నీరు జార మిము గూర్చిన వారలు వేడ్కమీర

ఆ "కన్నొలకుల నీరు జారడమా? ఎందుకూ?" సందేహంగా అడిగిందామె.

"ఆనందంతో!"

"దుఃఖంతో ఎందుకు కాకూడదు?"

నిలువుగుడ్లు పడ్డాయి. నిరుత్తరంగా ఆమెవైపు చూస్తున్నాను.

"మగువ, మధువుజోలికి పోకుండా ఇంత మంచి కవిత్వం రాస్తున్న వాడిని నిన్నొక్కణ్ణే చూశాను! పోనీలే! అది నీ కర్మ! – ఓహ్ నేనెన్ని సినిమా పాటలకు ప్రేరణ ఇచ్చానో? ఎంతమంది రచయితలకు ఉత్తేజాన్నిచ్చానో?" – తనలో తానుగా ఆమె గతాన్ని నెమరు వేసుకొంటుంటే చిలిపితనం చిగురిస్తూ ఉంది.

"అనుభవాల కోసం అందరు అర్రులు చాస్తారు. అయితే బాధ్యతలు మనిషిని వాటి నుండి దూరం చేస్తాయి!"

"హు! బాధ్యతలు....!"

"అవునండీ! పదవ తరగతి చదువుకొంటూంది పెద్దది. దాని కాళ్ళు చూస్తే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. చెప్పులు లేకుండా బడికి పోతూంది. రెండో దానికి వోణీలు వేసే వయసొచ్చినా ఆ సంగతే మరచినట్లు నటిస్తున్నాం. మూడోవాడు మూడు రోజులుగా బెంచీ మీద నిలబడుతున్నాడట! – పలక పగలకొట్టి. ఈ స్థితిలో...."

అర్థోక్తిలో ఆమెవంక చూశాను. ఆమె కనుకొలకుల్లో కన్నీళ్ళు. ఆశ్చర్య పడ్డాను. అంతలోనే 'అయ్యో! నా గోడుతో ఆమె ఆనందాన్ని కాస్తా పాడు చేశానే!' అని ఆవేదన పడ్డాను. సూటిగా ఆమె వైపు చూడలేక సిగ్గుతో తల వాలిపోయింది. "ఛ ఛ ! – ఎంతడబ్బు తగలేశానో?" అన్న మాటలు చెవిని పడేసరికి ఆమెను చూశాను. ఎటో చూస్తూ ఏమిటో గొణుగుతూ ఉంది. ఆమె అభిప్రాయాల్ని అర్థం చేసుకుందామని రెప్పార్చకుండా ఆమెనే చూస్తున్నాను. ఉన్నట్లుండి ఆమె నా రెండు చేతుల్ని పట్టుకొనింది!

సందేహంగా ఆమెనే చూస్తున్నాను!

"ఏం? సందేహిస్తున్నారా? పడుపు కూడని అసహ్య పడుతున్నారా! ఫరవాలేదు లెండి. ఆమాట కొస్తే రేపా పెద్దమనిషి మీ ఆశీర్వాదాన్ని అందుకొని ఘనంగా సన్మానించబోతున్నాడే! – ఆడబ్బెలా సంపాదించాడో తెలుసా మీకు?"

ఛళ్ళున చెంప మీద కొట్టినట్లనిపించింది. తడుముకొనే దానికి కూడ వ్యవధి లేదు. జోడించిన చేతులు జోడించినట్లే ఉన్నాయి. గిరుక్కున వెనక్కు తిరిగి గబగబ బయటికి నడిచాను. అప్పుడు చేతుల్ని విప్పిచూచుకొన్నాను. కండ్లు చెదిరాయి. ఫళఫళ మంటున్న పచ్చ కాగితాలు! ఆ కాగితాల విలువ మూడువందలు! లోకం దృష్టిలో – నా దృష్టిలో అమూల్యం! – అందుకే ఆ అమూల్యమైన కానుకను అతిభద్రంగా దాచుకొన్నాను.

* * * *

ఆకాశమంత పందిరికింద అంతాయింతా కాని కోలాహలంలో ఏకాకిగా నిలబడ్డ నా ముందు గతం ఒక్కసారి కన్నులకు కట్టినట్లనిపించింది. మళ్ళీ ఒకసారి చేతుల్ని చూసుకొన్నాను. అవి వట్టిచేతులే!-

తల పైకెత్తాను. విరగబడి నవ్వుతూ ఉంది ఎదురగా నిలబడి గదిలో కనిపించిన సుందరి. నా పరిస్థితి నాకే సిగ్గనిపించింది. అడుగు ముందుకు వేశాను.

"నాకు చెప్పులెలా కొని తెస్తావు నాన్నా!... నా లోబాడీల సంగతి డాడీ!... నన్నింకా ఎన్నాళ్ళు బెంచీమీద నిలబడమంటావు నాన్నా!"- అని నలుగురు పిల్లలు నన్ను నిలదీస్తున్నారు.

"ఆ పెద్దమనిషి ఇవ్వకపోతే పోయాడులే!... నాదగ్గర డబ్బు ఉంది గదా?... ఆమె ఇచ్చిన అమూల్యమైన కానుకగా దాచుకొందామనుకొన్నాను. అలా కాదు. ఆ డబ్బును మీకోసం ఖర్చు పెడతాను. అలా సద్వినియోగమైతేనే ఆమెకు తృప్తికలుగుతుంది!" అని గొణుగుతున్నాను.

ఆ మాటలు వినడానికి పిల్లలక్కడలేరు. నా ఊహలు నన్నే వెక్కిరిస్తున్నాయి. ఊహా లోకం నుండి ఈ లోకంలో పడ్డాను. ఎవరో పెద్దాయన నా ఆశీర్వాదం అచ్చయిన కాగితాన్ని తలపంకిస్తూ తన్మయత్వంతో చదువుతున్నాడు. మరొక నూనూగు మీసాల యువకుడు ఓ అందమైన యువతివైపు తినేద్దామన్నంత తియ్యగా చూస్తున్నాడు. ఆనందించడానికి 'కవిత-కన్య' అందరికి అవసరమే!- అయితే అవసరం తీరిపోతే ఆలోచించే వాళ్ళే ఉండరు. ఈ భావనతో ఆవేశం. ఆవేశంలో ముందుకు నడిచాను. ఆకాశమంత పందిరిని దాటి పోబోతున్నాను. ఆ దృశ్యాన్ని చూసి అలానే నిలబడి పోయాను.

ఇందాకా కమ్ముల్ని పట్టుకొని వేలాడుతున్న గబ్బిలా ల్లాంటి మానవాకారాలు ఇప్పుడు ఎంగిలాకులపైకి ఎగబడుతున్నాయి. ఆ ఎంగిలాకుల్లో మిగిలిన తిండిని పోటీపడి జవురుకొని తింటున్నారు. అయితే వాళ్ళు కూడా 'కరేపాకు'ను తీసి అవతల పారేస్తున్నారు.

క్షణం నిలబడలేక పోయాను అక్కడ! ●

ఆంధ్రభూమి
(15, ఫిబ్రవరి 1979)